క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న వైద్యులు

యాదమరి: మండలంలోని సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు సాన్స్ కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆస్పత్రి ఆవరణలో శనివారం ఉదయం ఆశ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ సాన్స్ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 24 వరకు ప్రతి రోజు చిన్నపిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని చెప్పారు. వారికి దగ్గు, జలుబు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్నా, జ్వర తీవ్రతను గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేలా చూడాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: స్థానిక సంతపేటలోని శ్రీ పార్వతీ సమేత సుందరేశ్వరస్వామి రాజరాజేశ్వరి దేవి ఆలయంలో శనివారం కుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమ, కలశ పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం దుశ్శాలువలతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఏనుగుల సంచారం

రామకుప్పం: మండలంలోని ననియాల తండా పరిధిలో శనివారం రాత్రి ఏనుగులు సంచరించాయి. సమీప పంట పొలాలపై దాడి చేసి నాశనం చేశాయి. వాటిని అడవిలోకి తరిమేందుకు రైతులు ప్రయత్నించారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగుల కదలికలను ముందుగా గుర్తించి గ్రామాల వైపు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థికి విజ్ఞానం

బంగారుపాళెం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శాఖ గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయన్నారు. విజేతలకు ఈ నెల 20వ తేదీ బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ధనం జయరాజు పాల్గొన్నారు.





బంగారుపాళెం: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఐరాల: సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

విజ్ఞానవంతులు కావాలి

ఐరాల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలని మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీయ రీజినల్ చైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయాధికారి సుజాత ఆధ్వర్యంలో శనివారం దిశ చట్టంపై అవగాహన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. చాలా మంది మహిళలు, విద్యార్థినులు సామాజిక మాధ్యమాలకు ఆకర్షితులై వేధింపులు, మోసాలకు గురవుతున్నారని, ఇలాంటి వాటికి దిశ చెక్‌పెట్టి రక్షణ కవచంలా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా దిశ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, పార్టీ నేత సురేష్‌రెడ్డి, జెడ్పీటీసీ సుచిత్ర, ఎంపీడీఓ నాగరాజు, హెచ్‌ఎంలు కోమల, శ్రీహరి పాల్గొన్నారు.

బంగారుపాళెం: సమాజంలో బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డి కళ్యాణి అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కీరమంద, అండారెడ్డిపల్లె–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల హక్కులపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకునేలా చూడాలన్నారు. బాలల హక్కుల చట్టం 2005 ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను పనులకు పంపితే నేరమని చెప్పారు. మిషన్ వాత్సల్య పథకం ఉపయోగాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, గ్రామ సచివాలయ సిబ్బంది పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. పాఠశాలలో శనివారం ఉదయం విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన జిల్లా బాలల పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల హక్కులు, స్కూల్ డ్రాప్ అవుట్‌లపై అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యం.. ప్రభుత్వ ధ్యేయం

గుడిపాల: ప్రజలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ ధ్యేయమని 104 వైద్యాధికారి సందీప్ అన్నారు. మండలంలోని పెద్దిశెట్టిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 65 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది చంద్ర, తేజ, విజయ, ఇందుమతి, నిరోషా, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే వైద్యం

ఐరాల: ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందుతోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు ఇంటి వద్దనే మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. గర్భిణులు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సందీప్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి చిత్తూరులోని గిరింపేటకు చెందిన గౌతమి రూ.లక్ష విరాళం అందించారు. ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి రూ.లక్ష విరాళం అందించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

కాణిపాక ఆలయానికి ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలైంది. క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. అయ్యప్ప భక్తుల బృందాలు వందలాది మంది తరలిరావడంతో, ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనం కల్పించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కరిడివారి పల్లె దళితవాడకు చెందిన సుధాకర్ బంగారుపాళెం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుధాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని చీలాపల్లె సీఎంసీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

చిత్తూరు అర్బన్: ఓటరు జాబితాలో పేరు లేనివారు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో చిన్నయ్య, మునిసిపల్ కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ– 2024 కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకు ఉంటుందని, డిసెంబర్ 2, 3 (శని, ఆదివారాలు) తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సవరణలు ఉంటే సరైన ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పారదర్శకంగా కులగణన సర్వే

తవణంపల్లె: కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వాహించాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కులగణనపై వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాంఆజాద్ మాట్లాడుతూ మండలంలో ఈ నెల 27 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి కులగణన సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు తెలుసుకొని వలంటీర్ యాప్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేయించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను సమగ్రంగా సర్వే చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సాహితీవేత్తలుగా ఎదగాలి

పూతలపట్టు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని మంచి సాహితీవేత్తలుగా ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని గ్రంథాలయంలో శనివారం సాహితీ సదస్సును నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ సాహిత్యం పట్ల విద్యార్థులు మక్కువ చూపాలని కోరారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సాహితీ వేత్తలుగా, కవులుగా సమాజానికి తోడ్పాటునివ్వాలని పిలుపునిచ్చా రు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమ వారం బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ పండుగ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం రాత్రి గ్యార్మీ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముస్లింలు జెండాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి జెండాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శ



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డాక్టర్ ప్రియాంక, వైద్య సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని జి.వడ్డిపల్లెలో పెద్దభూపాలం కాయలు తిని అస్వస్థతకు గురై చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, మండల వైద్యాధికారి ప్రియాంక, ఎంఎల్‌హెచ్‌పీ పావని, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఈఓపీఆర్డీ కుమార్ పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి ఆస్పత్రిలో డాక్టర్లను వాకబు చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని, ఎలాంటి ప్రమాదం లేదని వివరించారు. ఆదివారం పిల్లలను డిస్‌చార్జి చేయనున్నట్లు తెలిపారు.

ట్రాక్ మరమ్మతు పనులు ముమ్మరం

చిత్తూరు కార్పొరేషన్: గుడిపాల మండలం రామాపురం 49వ క్రాస్ వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు రైల్వే పి.వై సెక్షన్ ఆఫీసర్ మధుసూదనయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 22 వరకు ఓవర్ హాలింగ్ పనుల కారణంగా ట్రాక్ చుట్టూ తవ్వి కొత్త లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రోజుల్లో వాహనదారులు అటువైపుగా వెళ్లడం కుదరదని, ఈ విషయం గుర్తించి వాహనదారులు సహకరించాలని కోరారు.



పనులు జరుగుతున్న రామాపురం రైల్వే క్రాస్